


నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

17 మంగళవారం నవంబర్ 2026 పేజీలు: 3

చామల కిరణ్ కుమార్ రెడ్డి నాయనమ్మ దశదినకర్మకు కాంగ్రెస్ నాయకులు హాజరు



- రంగనాయకమ్మకు ఘన నివాళులర్పించిన పర్వతం వేణు
- దశదినకర్మలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు

భువనగిరి, 16 నవంబర్ (సత్యనిష్ఠ) : భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నాయనమ్మ రంగనాయకమ్మ దశదినకర్మకు కాంగ్రెస్ నాయకులు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పర్వతం వేణు రంగనాయకమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ క్రీడలలో నల్లగొండ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

- జిల్లా అడిషనల్ ఎస్పీ రమేష్

నల్గొండ, నవంబర్ 16 (సత్యనిష్ఠ): ఉమ్మడి నల్గొండ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సీనియర్ గర్ల్స్ హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక సెలక్షన్స్ కు ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అడిషనల్ ఎస్పీ రమేష్ క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి నల్లగొండ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్, నల్లగొండ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆది రెడ్డి, ఏ ఆర్ ఆర్ ఐ శ్రీనివాస్, జాతీయ స్థాయి క్రీడాకారులు ఆర్ ఎస్ ఐ నరసింహ, శ్రీకృష్ణ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపల్ నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సెలక్షన్స్ లో ఉమ్మడి మూడు జిల్లాల నుండి 80 మంది





క్రీడాకారులు పాల్గొన్నారని హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు. ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 4 నుండి 6 వరకు కట్టంగూర్ మండలం చెరువు అన్నారం గ్రామంలో జరిగే 55వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ గర్ల్స్ హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్‌లో పాల్గొం టారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ బాల్ కోచ్ లు నందిని గుప్తా, పార్వతి, లక్ష్మి, సీనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారులు నరేష్, రామకృష్ణ, ప్రవీణ్, ప్రభాకర్, ఆస్మా, నందిని, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి మీడియా వెన్నెముక - ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి పాత్రికేయులు

- జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులకు జనయేత్రీ ఫౌండేషన్ అభినందనలు
- కలం ప్రజల పక్షాన నిలిస్తేనే సమాజంలో మార్పు: డా. మునీర్ అహ్మద్ షరీఫ్

నల్గొండ, నవంబర్ 16 (సత్యనిష్ఠ) : జాతీయ పత్రికా దినోత్సవం సందర్భం గా పాత్రికేయులకు జనయేత్రీ ఫౌండే షన్ అభినందనలు తెలియజేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం పాత్ర ఎంతో కీలకమైనదని ఫౌండేషన్ పేర్కొంది. ప్రజలను చైతన్యపరచడం లో, సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవడంలో మీడియా అందిస్తున్న సేవలు అభినందనీయమని ఫౌండేషన్ అభిప్రాయపడింది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అవినీతి, పేదల సమస్యలు, నిరుపేదల కష్టాలు, ప్రజా సమస్యలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకువస్తూ సమాజ మార్పు కోసం పాత్రికేయులు చేస్తున్న కృషి వెలకట్టలేనిదని తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంలో స్థానిక పాత్రికేయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొంది. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం, ప్రజల గొంతుకగా నిలవడం, సమాజానికి సరైన సమాచారాన్ని అందించడం పత్రికా రంగం బాధ్యతని,



వార్తల ప్రచురణలో నిజానిజాల పరిశీలన, నిష్పక్షపాత వైఖరి, సామాజిక బాధ్యత అత్యంత అవసరమని తెలిపింది. ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్ల మధ్య పనిచేస్తూ ప్రజల కోసం తమ సమయాన్ని కేటాయిస్తున్న ప్రతి పాత్రికేయుడికి ఈ సందర్భంగా జనయేత్రీ ఫౌండేషన్ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తోంది. కలం ప్రజల పక్షాన నిలిస్తే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, నిజాన్ని నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులే ప్రజాస్వామ్యానికి నిజమైన బలమని పేర్కొంది. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి వృత్తిపరమైన ప్రయాణం మరింత విజయవంతం కావాలని జనయేత్రీ ఫౌండేషన్ ఆకాంక్షిస్తోంది.

నలగొండలో ఆలిండియా రైతు సంఘం బహిరంగ సభ విజయవంతం

- రైతు కార్మిక వర్గానికి, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.
- బెల్లంకొండ సత్యనారాయణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి.

కోదాడ - నవంబర్ 16 (సత్యనిష్ఠ) నల్లగొండలో జరిగిన రైతు సంఘం ఆల్ ఇండియా బహిరంగ సభ విజయవంతం చేసిన రైతులకి, కార్మికులకు, వ్యవసాయ కార్మికులకి, అధికారులకి, ఉద్యోగస్తులకు, మీడియా మిత్రులకు రైతు సంఘం సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. పత్రికా విలేకరులతో బెల్లంకొండ సత్య నారాయణ మాట్లాడుతూ నిన్న నల్గొండలో జరిగిన లక్ష మంది బహిరంగ సభకి మండలం నుంచి బయలు దేరిన రైతు, కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న కార్పొరేట్ అనుకూల రైతు కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా రైతులా నుండి భూమిని వేరు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక



విధానాల మీద, యూరియా యాప్ లాంటి యాపులు తీసుకొచ్చి రైతులకి ఎరువులు విత్తనాలు అంద కుండా చేస్తున్న విధానాల మీద రైతే పండించిన పంటకి ధర నిర్ణయించే విధంగా 55 సంవత్సరాల నిండిన రైతు దంపతులకు ప్రతి ఒక్కరికి 10,000 రూపాయల గౌరవ పింఛన్ ఇవ్వాలని జరిగే పోరాటంలో అందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాలని రైతులకి పిలుపు నిచ్చారు.

సాయి మందిరంలో అయ్యప్ప మాలదారులకు అన్నదానం

కోదాడ నవంబర్ 16 (సత్యనిష్ఠ) కార్తీక మాసాన్ని పురస్కరించు కొని నడిగూడెం శిరిడి సాయి మందిరంలో సోమవారం అయ్యప్ప మాలదారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. షిరిడి సాయి సేవా సమితి ఆధ్వర్యంలో



నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు పందిరి వెంకటరెడ్డి, ఏ కృష్ణయ్య, కమిటీ సభ్యులు మహేష్, మండవ వెంకటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, వందనపు దయాకర్, సూర్యప్రకాశరావు, కృష్ణమూర్తి, విజయ చంద్రమోహన్, గురు స్వాములు కాసాని వెంకన్న, రాము, అయ్యప్ప మాల దారులు పాల్గొన్నారు.

చింతాబాబు మాదిగకు అంబేద్కర్ నేషనల్ అవార్డు

- న్యూ ఢిల్లీలో జాతీయ బహుజన సాహిత్య అకాడమీ పురస్కార ప్రదానం



కోదాడ – నవంబర్ 16 (సత్యనిష్ఠ) కోదాడ వాసి చింతాబాబు మాదిగకు అరుదైన గౌరవం, న్యూఢిల్లీలో 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు' ప్రదానం, కోదాడ ప్రాంతానికి చెందిన ప్రముఖ దళిత ఉద్యమ కారుడు చింతాబాబు మాదిగ ప్రతిష్ఠాత్మక 'డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ అవార్డు'ను అందుకున్నారు. సోమవారం న్యూ ఢిల్లీ లోని కరోల్ బాగ్ కళా మందిరంలో జాతీయ బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నేషనల్ అవార్డు గ్రహీతల సత్కార సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కరోల్ బాగ్ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే, నేషనల్ లీగల్ అడ్వైజర్ సుధారాణి మరియు జాతీయ బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణలు కలిసి చింతాబాబు మాదిగకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చింతాబాబు మాదిగ మాట్లాడుతూ 1990 నుండి నేటి వరకు సుదీర్ఘంగా 35 సంవత్స రాలుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కొన సాగుతూ జాతికి సేవ చేస్తున్నానని తెలిపారు. మార్గదర్శి యూత్ స్ఫూర్తి, స్వచ్ఛంద దళిత ఉద్యమ కార్యక్రమాలలో తాను చేసిన సామాజిక సేవలను గుర్తించి జాతీయ బహుజన సాహిత్య అకాడమీ ఈ అవార్డు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 'దళిత రత్న మాదిగ' బిరుదును అందు కున్నానని, నేడు జాతీయ స్థాయిలో అంబేద్కర్ అవార్డు రావడం గర్వ కారణమని పేర్కొన్నారు. ఈ అవార్డు అందించిన అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణకు, తనకు నిరంతరం సహకరిస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ మాదిగ లకు మరియు తన సొంత ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నల్గొండలో జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్

ఫెయిర్నేటి నుండి 19 వరకు విజ్ఞాన ప్రదర్శనలు



నల్గొండ, 16 నవంబర్ (సత్యనిష్ఠ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జీవి గూడెం, నల్గొండలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్‌ను 'బ్రెయిన్ బ్రెయిన్' పేరుతో నేటి నుండి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ లలిత కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, నగరపాలక సంస్థ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సమన్వయ కార్యకర్త విద్యా రాణి, డీసీఓ జె. శోభారాణిలతో పాటు పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలను నాలుగు జోన్లుగా విభజించి ఈ విజ్ఞాన ప్రదర్శనలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. తరగతి గదుల్లో నేర్చుకున్న శాస్త్రీయ సిద్ధాంతాలను ఆచరణాత్మక ప్రయోగాలు, వివిధ నమూనాల రూపంలో ప్రదర్శించేందుకు సైన్స్ ఫెయిర్ చక్కని వేదికగా నిలవనుందన్నారు. విద్యార్థుల్లోని అంతర్గత ప్రతిభను వెలికితీయడంతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించేందుకు ఈ ప్రదర్శనలు దోహదపడతాయని తెలిపారు.

ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా రైస్ మిల్లుకు అనుమతులా

- గ్రామసభ, ట్రేడ్ లైసెన్స్ వివరాలు వెల్లడించాలి
- మిల్లును గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలి
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొత్తపల్లి రవి

సత్యనిష్ఠ-గరిడేపల్లి

గ్రామ ప్రజల సమస్యలను, ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా సునంద రైస్ ఇండస్ట్రీస్ మిల్లును తిరిగి నిర్వహించేందుకు అనుమతులు ఎలా ఇస్తారని గరిడేపల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొత్తపల్లి రవి ప్రశ్నించారు. గ్రామ ప్రజల ఆరోగ్యానికి భంగం కలగకుండా మిల్లును గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం కొత్తపల్లి రవి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు తో కలిసి ఎంపీడీఓ, తహసీల్దార్ (ఎంఆర్ఓ), గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో సునంద రైస్ ఇండస్ట్రీస్ మిల్లుపై సివిల్ సప్లై, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించి, సుమారు రూ.22 కోట్ల విలువైన సీఎంఆర్ బియ్యం విషయంలో అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు గుర్తించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో మిల్లు యజమానులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడంతో మిల్లు మూడు నెలల పాటు మూతపడిందని తెలిపారు. అయితే



సంబంధిత కేసు పెండింగ్‌లో ఉండగానే, గ్రామసభ తీర్మానం వివరాలు, గ్రామపంచాయతీ ట్రేడ్ లైసెన్స్ వివరాలు వెల్లడించకుండా మిల్లును తిరిగి ఎలా ప్రారంభించారని ప్రశ్నించారు. సర్వే నంబర్లు 722, 704/5/1లో ఉన్న సునంద రైస్ ఇండస్ట్రీస్ పేరుతో గ్రామపంచాయతీ ట్రేడ్ లైసెన్స్ లేదని, ఫ్యాక్టరీ లైసెన్స్, కాలుష్య నియంత్రణ మండలి (గ్రాజీ) అనుమతి పత్రాలు, క్రయవిక్రయ దస్తావేజులు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. ట్రేడ్ లైసెన్స్‌కు ఏడాది మాత్రమే గడువు ఉంటుందని, ప్రతి సంవత్సరం రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. 2020 నుంచి 2026 వరకు ట్రేడ్ లైసెన్స్ లేకుండానే మిల్లు ఎలా నిర్వహించారని అధికారులను నిలదీశారు. ట్రేడ్ లైసెన్స్ లేని మిల్లుకు సివిల్ సప్లై అధికారులు వడ్లు, సీఎంఆర్ కేటాయింపులు ఎలా చేశారని ప్రశ్నించారు. గ్రామపంచాయతీ అనుమతుల వివరాలను పరిశీలించకుండా ప్రభుత్వ ధాన్యం కేటాయించడం నిబంధనలకు విరుద్ధం కాదా అని నిలదీశారు. మిల్లు నిర్వహణ వల్ల వెలువడుతున్న దుమ్ము, ఊక ధూళి, శబ్ద కాలుష్యంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా బాధితుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, చట్టానికి, న్యాయానికి అనుకూలంగా గ్రామ ప్రజల ప్రయోజనాల కోసమే పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం వెంటనే స్పందించి మిల్లును గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌తో పాటు సివిల్ సప్లై, కాలుష్య నియంత్రణ మండలి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదులు చేయడంతో పాటు సమాచార హక్కు చట్టం (ఆ×) ద్వారా వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రవి, ఎమ్మార్పీఎస్ మండల సభ్యులు ఆలంపల్లి శేఖర్, ఎంఎస్ఎఫ్ నాయకుడు కొత్తపల్లి పవన్, మచ్చ ఆదాం, నాగరాజు, మచ్చ వేణు, సాత్విక్‌తో పాటు పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన గుడిపల్లి మండలానికి చెందిన 30 రైతు కుటుంబాలు

- కాంగ్రెస్ 420 హామీలు అమలు చేయాలి - రవీంద్ర కుమార్
- కేసీఆర్ హయాంలోనే రైతాంగం గౌరవంగా జీవించింది

దేవరకొండ, 16 నవంబర్ (సత్యనిష్ఠ): దేవరకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా అధ్యక్షులు మరియు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్ సమక్షంలో గుడిపల్లి మండలం, కేశంనేనిపల్లి గ్రామానికి చెందిన 30 మంది రైతు కుటుంబాలతో పాటు పలువురు యువకులు పార్టీలో చేరారు. వారిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు రవీంద్ర కుమార్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డమైన హామీలు, అసత్య ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందని, అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాలు, విమర్శలు పక్కనపెట్టి ముందుగా ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో తెలంగాణ రైతాంగం




గౌరవంగా జీవించిందని గుర్తు చేశారు. 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్, పుష్కలంగా సాగునీరు, సకాలంలో యూరియా, ఎరువుల పంపిణీ, పంట వేయగానే రైతుబంధు సాయం, ధాన్యం కొనుగోళ్లలో పక్కా వ్యవస్థతో రైతులకు అండగా నిలిచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఆ వ్యవస్థలు కూడా నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. ఒక వైపు త్రాగు నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే, మరో వైపు వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోతోందన్నారు. ప్రభుత్వం మెడలు వంచి కేసీఆర్ హయాంలో అమలైన రైతు సంక్షేమాన్ని తిరిగి సాధించుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎల్గురి వల్లపు రెడ్డి, సీనియర్ నాయకులు తోటకూరి పరమేష్, సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, మర్రి కృష్ణయ్య, ఎర్ర సైదులు, ఉపసర్పంచ్ అర్వపల్లి సినయ్య, లోకేష్ నాయక్, గణపురం సైదులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలకు మీడియాలో ప్రాధాన్యత తగ్గుతోంది

- **రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కొండందరాం**
- **పత్రికా స్వేచ్ఛ పరిరక్షణతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ**

హైదరాబాద్, 16 నవంబర్ (సత్యనిష్ఠ) : పత్రికలు, చానళ్లు సమాజ శ్రేయస్సు కోసం పనిచేయడం తగ్గిపోతుందని, ప్రధాన స్రవంతిలోని కొన్ని మీడియా సంస్థలు వివిధ రాజకీయ పార్టీలకు అనుబంధంగా మారిపోవడంతో ప్రజా ప్రయోజనాలకు మీడియాలో ప్రాధాన్యత కొరవడుతుందని శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం విచారం వ్యక్తం చేశారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని, తెలంగాణ మీడియా అకాడమీ, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే)ల సంయుక్త ఆధ్వర్యంలో, సోమవారం నాడు నాంపల్లిలోని మీడియా అకాడమీ భవన్ లో, అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రవీష్ లాంటి స్వతంత్ర జర్నలిస్టులు, వైర్ లాంటి సంస్థలు ప్రజా సమస్యలను ధైర్యంగా వెలుగులోకి తేవడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ, నేడు జర్నలిస్టులు స్వేచ్ఛగా, స్వతంత్రంగా పనిచేసే పరిస్థితి లేదన్నారు. విలేకరుల నుంచి ఎడిటర్ల దాకా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, మీడియాలో వచ్చే విమర్శనాత్మక కథనాల వల్ల ప్రభుత్వ పెద్దలు నొచ్చుకుంటే వాటిని రాసిన జర్నలిస్టుల ఉద్యోగం తీసేయడానికి కూడా యాజమాన్యాలు వెనకాడటం లేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఉన్న పత్రికా వ్యవస్థను పరిరక్షించుకొని తద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ పద్మజా షా మాట్లాడుతూ, డిజిటల్, సోషల్ మీడియాలు ప్రాచుర్యం పొందుతుండడంతో మీడియా వ్యవస్థ తీరు మారిపోతున్నదన్నారు. వార్తల కోసం సాంప్రదాయ మీడియా సాధనాలైన పత్రికలు, టెలివిజన్ చానళ్ల మీద ఆధారపడే పరిస్థితి తగ్గిపోతున్నదని, రాయిటర్ సంస్థ ఇటీవల నిర్వహించిన ఒక సర్వే ప్రకారం 58 శాతం మంది వార్తల కోసం సోషల్ మీడియానే ఎంచుకుంటున్నారని ఆమె తెలిపారు. ఫేస్బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్ స్టాగ్రామ్ వంటి మీడియా సాధనాలలో ట్రోల్





బాధ్యతను నిర్వర్తించడానికా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. వీక్షకుల, పాఠకుల సంఖ్యను పెంచుకోవడం కోసం సంచలనాత్మక శీర్షికలు, అర్ధసత్యాలు, వ్యక్తిగత ఆరోపణలు, నిర్ధారణ కాని వార్తల కోసం పరుగులు తీయడం వంటి చర్యలు తాత్కాలిక ఆదరణ పొందుతాయే తప్ప, సమాజానికి మేలు చేయవని ఆయన అన్నారు. మీడియా ప్రజాకర్షకంగా ఉండటం తప్పు కాదని, ఆ ఆకర్షణ కోసం వాస్తవాలు, విలువలు, నైతికత బలికాకూడదని విరాహత్ సూచించారు. పత్రికా స్వేచ్ఛ, నైతిక ప్రమాణాల పరిరక్షణ కోసం 60 ఏండ్ల క్రితం ఆవిర్భవించిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థను, నేటి పాలకులు తమ గుప్పిట్లో పెట్టుకొని వారి కనుసైగల్లో కొనసాగించడం అవుతున్న తమకు నచ్చని వార్తలను, కథనాలను ప్రభుత్వం ఆ వేదికల యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చి తొలగిస్తున్నదన్నారు. వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఎన్నో ప్రధానమైన సమస్యలను పక్కనబెట్టి ఒక అప్రధానమైన థీమ్ ను నేషనల్ ప్రెస్ డే రోజు చర్చ కోసం ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించడం విచారకరమన్నారు. ప్రధాన స్రవంతి మీడియా కార్పొరేట్ మయమై పోయిందని, జాతీయస్థాయిలో అనేక ప్రధాన పత్రికలను కేంద్ర ప్రభుత్వం తన గుప్పిట్లో పెట్టుకుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, నేటి సమాజంలో జర్నలిజం వృత్తి ఒక కీలకమైన చర్చనీయాంశంగా మారిందని, జర్నలిజం ప్రజలను ఆకర్షించడానికా? లేక సమాజం పట్ల సహించరానిదన్నారు. సమావేశంలో సుప్రసిద్ధ పాత్రికేయులు డాక్టర్ కె. రాంచంద్రమూర్తి, సియాసత్ పత్రికా మేనేజింగ్ ఎడిటర్ ఆమెర్ అలీ ఖాన్, సీనియర్ పాత్రికేయులు నాగసూరి వేణుగోపాల్, మల్లేపల్లి లక్ష్మయ్య, నిమ్స్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ నిజామి, సామాజిక కార్యకర్త కె. సజయ, ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం. ఏ. మాజీద్, జాతీయ ఉపాధ్యక్షుడు వై. నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, బి. కిరణ్ కుమార్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుబాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, యూనియన్ మహిళా విభాగం నాయకులు కళ్యాణం రాజేశ్వరీ, అత్తలూరి అరుణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు

కోదాడ – నవంబర్ 16 (సత్యనిష్ఠ)



ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికా రంగం పాత్ర అమూల్య మైనది. ప్రజల గొంతుకగా నిలుస్తూ, ప్రజా సమస్యలను ఎప్పటి కప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తూన్న మీడియా మిత్రులకు జాతీయ పత్రిక దినోత్సవ సందర్భంగా పిఆర్టియు మండల అధ్యక్ష కార్యదర్శులు కాసాని నాగేశ్వరరావు, బత్తిని గోపి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ, సమాజం లోని మంచి చెడులను నిర్భయంగా ప్రశ్నిస్తూ సమ సమాజ నిర్మాణానికి నిరంతరం కృషి చేస్తున్న మీడియా (ప్రింట్ మీడియాఎలక్ట్రానిక్ మీడియా శాటిలైట్స్ ఛానళ్లు) వివిధ పత్రికలు, టీవీ ఛానళ్ల ప్రతినిధులు, జర్నలిస్టు మిత్రులందరికీ హృదయ పూర్వక జాతీయ పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ. కలం కదిలితే సమాజం ఆలోచిస్తుంది, అక్షరం పలికితే ప్రజాస్వామ్యం మేల్కొంటుంది, పత్రిక అనేది కేవలం వార్తలను అందించే మాధ్యమం కాదూ, ప్రజల ఆశయాలకు, ఆకాంక్షలకు, హక్కులకు ప్రతిబింబం. నిజాన్ని నిర్భయంగా వెలుగు లోకి తీసు కొచ్చే మీ కలం ఎప్పుడూ ప్రజల పక్షాన నిలవాలి. మీ అక్షరాలు సమాజ మార్పుకు నాంది కావాలి. మీ సేవలు ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేయాలి. ప్రజల పక్షాన మీ ప్రయాణం నిరంతరం కొనసాగాలని, వృత్తి పరంగా మరింత ఉన్నత శిఖరాలను అధిరో హించాలని మనస్ఫూర్తిగా కోరు కుంటున్నాము.

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు శుభాకాంక్షలు

- **పత్రికా రంగం ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం**
- **జర్నలిస్టుల హక్కులు, భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి : బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**



హైదరాబాద్, 16 నవంబర్ (సత్యనిష్ఠ): జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా కీలక పాత్ర పోషిస్తోందని, సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల కృషి ఎంతో గొప్పదని ఆయన అన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు జర్నలిస్టులు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా అణగారిన వర్గాలు, బడుగు బలహీన వర్గాల సమస్యలను సమాజం దృష్టికి తీసుకురావడంలో మీడియా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. జర్నలిస్టులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ సమాజ హితం కోసం నిరంతరం పనిచేస్తున్నారని, వారి హక్కులు, భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల కలం ప్రజాస్వామ్యానికి బలం కావాలని, సమాజ మార్పుకు అక్షరమే ఆయుధం కావాలని అన్నారు.

పంది శ్రీను సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే బాలు నాయక్
- నాయక్‌ఛింతకుంట్లలో పంది శ్రీను విగ్రహావిష్కరణ
- పంది శ్రీను కుటుంబానికి అండగా ఉంటాం - ఎమ్మెల్యే



కొండమల్లేపల్లి, 16 నవంబర్ (సత్యనిష్ఠ): కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ పంది శ్రీను కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. సోమవారం చింతకుంట్ల గ్రామంలో స్వర్గీయ పంది శ్రీను మరణించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పంది శ్రీను విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పంది శ్రీను సర్పంచ్ గా పనిచేసిన సమయంలో గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేశారని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. పంది శ్రీను భౌతికంగా మన మధ్య లేకపోయినా, ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు, ఆయనతో ఉన్న అనుబంధం ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోతుందని తెలిపారు. అంతేకాకుండా వారి కుటుంబానికి పార్టీ, వ్యక్తిగతంగా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎం.ఏ. సిరాజ్ ఖాన్, నాయిని మాధవ రెడ్డి, దూదిపాలా శ్రీధర్ రెడ్డి, దూదిపాలా వేణుధర్ రెడ్డి, ఉట్కూరి వేమన్ రెడ్డి, తేరా సత్యం, తిప్పర్తి రుక్మా రెడ్డి, మేకల శ్రీనివాస్ యాదవ్, ఎర్ర కృష్ణ, ఎంఆర్పీఎస్ నాయకులు, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ లో ఉన్న 7500 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- హాస్టళ్లలో కాస్మోటిక్, మెస్ చార్జీల బకాయిలు వెంటనే చెల్లించాలివిద్యార్థులకు న్యాయం చేయాలి : ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కట్టెల శివకుమార్



నల్లగొండ, 16 నవంబర్ (సత్యనిష్ఠ) : ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో నేడు నల్గొండ జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం అందించారు. పెండింగ్‌లో ఉన్న 7500 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో కాస్మోటిక్ చార్జీలు మరియు మెస్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కట్టెల శివకుమార్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం బహుజన పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసిస్తున్న సందర్భంలో స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం వలన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రవర్ణ పేద బిడ్డలు ఉన్నత చదువులకు దూరం కావాల్సి వస్తుందన్నారు. ప్రైవేట్ యాజమాన్యం కాలేజీలు వారి సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వారిని అనేక తీవ్ర మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలని, అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం కాస్మోటిక్ చార్జీలు మరియు మెస్ చార్జీలు విడుదల చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది విద్యార్థులు తీవ్ర మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పక్షాన విద్యార్థులకు న్యాయం చేసి ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బండారు శంకర్, రాష్ట్ర గౌరవ సలహాదారులు కందుల విజయకుమార్, పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, గౌరవ సలహాదారులు జూనీ మియా, స్టేట్ కమిటీ మెంబర్ సాల్మన్ రాజ్, ఉపాధ్యక్షులు సురేందర్ నాయక్, ప్రశాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మా ఎదుగుదలకు కారణం పత్రికా మిత్రులే-ఫాతిమా సొసైటీ

- మీ కలమే మా యాడ్, మీ అక్షరమే మా ప్రచారం-పర్వేజ్ హుస్సేన్
- పత్రికా మిత్రులకు ఫాతిమా ఎన్విరాన్మెంటల్ డెవలప్మెంట్ సొసైటీ హృదయపూర్వక ధన్యవాదాలు



మిర్యాలగూడ, 16 నవంబర్ (సత్యనిష్ఠ) : జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పత్రికా మిత్రులకు ఫాతిమా ఎన్విరాన్మెంటల్ డెవలప్మెంట్ సొసైటీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసింది. ఈ ఫోటో కేవలం పేపర్ కటింగ్స్ కాదు, ఇది మా సంస్థ చరిత్ర, మా పోరాటాల చరిత్ర, మిర్యాలగూడ ప్రజల గొంతు అని సొసైటీ అధ్యక్షులు మహమ్మద్ పర్వేజ్ హుస్సేన్ అన్నారు. ఫాతిమా ఎన్విరాన్మెంటల్ డెవలప్మెంట్ సొసైటీ దగ్గర పెద్ద డబ్బు లేదు, పెద్ద బిల్డింగ్ లేదు, పెద్ద వెహికల్స్ లేవు, మా దగ్గర ఉన్నది చిన్న చిన్న ఖర్చులు, పెద్ద పెద్ద సంకల్పాలు మాత్రమేనని, అయినా సంస్థ ఈరోజు ముందుకు వెళుతూ పెద్ద పెద్ద పోరాటాలు చేస్తుందంటే దానికి కారణం ఒక్కటే పత్రికా మిత్రులని తెలిపారు. మా దగ్గర పైసా ఆశించకుండా, ఒక్క రూపాయి అడగకుండా మా వార్తను రాసిన వాళ్ళదే ఈ క్రెడిట్ అంతా అని అన్నారు. మేము రోడ్డు మీద నిలబడి ఆహారం పంచితే దానిని వార్త చేసింది పత్రికే, రక్తదానం చేస్తే దానిని ప్రజలకు చేర్చింది పత్రికే, పర్యావరణం కోసం, నీటి కోసం, పేదవాడి తిండి కోసం పోరాడితే ఆ పోరాటాన్ని నలుగురికి తెలిసేలా చేసింది పత్రికేనని తెలిపారు. మాకు యాడ్ ఇవ్వడానికి డబ్బు లేదు, పెద్ద పెద్ద ప్రచారాలు చేయడానికి మనుషులు లేరు, కానీ మీ కలం ఉంది, మీ కలమే మా యాడ్, మీ అక్షరమే మా ప్రచారం, మీ పేపరే మా వేదిక అని అన్నారు. ఒక వార్త రాయడానికి మీరు ఎంత కష్టపడతారో మాకు తెలుసు, రాత్రి అయినా, ఎండ అయినా, వాన అయినా మీరు వచ్చి, మా మాట విని, ఫోటో తీసి, నిజాన్ని రాస్తారని, అది డబ్బు కోసం కాదు, ధర్మం కోసం, పత్రికా ధర్మం కోసం అని తెలిపారు. ఈ సంస్థ ఎదిగిందంటే అది మా గొప్పతనం కాదు, పత్రికా మిత్రుల గొప్పతనమని, మీరు లేకపోతే మేము లేము, మీ కలం లేకపోతే మా పోరాటం లేదు, మీ అక్షరం లేకపోతే మా గొంతు ఎవరికీ వినిపించదని అన్నారు. అందుకే మా తరపున, మిర్యాలగూడ ప్రజల తరపున, ఆకలితో ఉన్న ప్రతి ఒక్కరి తరపున మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, అలాగే సంస్థకు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ, మిగిలిన ఆహారం ఉందని ఫోన్ చేసి చెప్పే ప్రతి ఒక్కరికి, ఆహారం ఇచ్చే దాతలకు, మాతో కలిసి ఆహారం పంచే వాలంటీర్లకు, రక్తదానం చేసే ప్రతి దాతకు, మాకు సలహా ఇచ్చే పెద్దలకు, మా వెంట నిలబడే మిత్రులకు, మా మాటను నమ్మి సపోర్ట్ చేసే ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు. మీరు లేకపోతే ఈ సంస్థ లేదు, మీ సహాయం లేకపోతే ఈ పోరాటం లేదు, మీ ప్రేమ, మీ నమ్మకమే మా బలమని, మీ కలం ఎప్పుడూ నిజం వైపే ఉండాలని, మీ అక్షరం ఎప్పుడూ పేదవాడి వైపే ఉండాలని, మీరు రాసే ప్రతి అక్షరం సమాజంలో మార్పు తీసుకురావాలని, ఈ క్రెడిట్ అంతా మీదే, ఈ గౌరవం అంతా మీదేనని పేర్కొంటూ జాతీయ పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.